
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

5 సిద్దిపేట
సోమవారం 21 అక్టోబరు 2024


మీ త్యాగం మరువం 7

- నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం
- వారి కుటుంబసభ్యులకు సన్మానం
- నేటి నుంచి 31 వరకు అవగాహన కార్యక్రమాలు

రెచ్చిపోతున్నాయ్..

కొడకండ్ల గ్రామంలో ఇద్దరు మహిళలు, చిన్నారిపై శునకాల దాడి


(ఫైల్)

గజ్వేల్ రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో గ్రామ సింహాలు రెచ్చిపోతున్నాయి. శునకాల దాడులతో జనాలు బయటికి వెళ్లాలంటేనే జంకుతున్నారు. రోజురోజుకూ వీటి బెడద పెరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పిల్లల్ని పాఠశాలకు పంపాలంటే భయమవుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలువురు కుక్కలు దాడిలో గాయపడి చికిత్స పొందుతున్నారు. కాగా, ఆదివారం ఉదయం కొడకండ్ల గ్రామానికి చెందిన చిన్నారి శ్రావ్యపై శునకాలు దాడి చేసి గాయపరిచాయి. అదే గ్రామానికి చెందిన మరో ఇద్దరు మహిళలు బద్రి వీరమ్మ(68), పుల్ల పోచవ్వ(40)కు కుక్కల దాడిలో గాయాలయ్యాయి. ముగ్గురిని గజ్వేల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



శునకాల దాడిలో గాయపడిన చిన్నారి, మహిళ

సిద్దిపేట ఆర్టీవో కార్యాలయం


60:40

వసూలు చేయ్.. పంచేయ్..!

ఆర్టీవో కార్యాలయంలో ప్రతీ పనికోరేటు
నేరుగా వెళ్తే కొర్రీలు.. బ్రోకర్లతో నిమిషాల్లో పని
ఏసీబీ రైడ్స్ జరిగినా మారని అధికారుల తీరు !!

సిద్దిపేట క్రైం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో అధికారులు మారినప్పటికీ వసూళ్లకు అడ్డుకట్ట పడడంలేదు. గతంలో ఏసీబీ రైడ్స్ జరిగినా అధికారుల తీరు మారడంలేదు. పనిపై కార్యాలయానికి వచ్చిన ఏ ఒక్కరినీ వదలకుండా ప్రతీ పనికోరేటు నిర్ణయించి మరి డబ్బులు దండుకుంటున్నారు. నేరుగా వెళితే అనేక కొర్రీలు పెడుతూ పదేపదే కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ ముప్పు తిప్పలు పెడుతున్నారు. అదే ఏజెంట్/బ్రోకర్‌తో వెళ్తే కొర్రీలు కాదుకదా.. నిమిషాల్లో పని జరిగిపోతుంది. గతంలో అవినీతి ఆరోపణలతో జరిగిన ఏసీబీ తనిఖీల్లో ఆర్టీవో కార్యాలయానికి వచ్చే ఫైళ్లలో 90 శాతం ఏజెంట్లు/ బ్రోకర్ల ద్వారా వచ్చినవేనని తేలడం ఇక్కడి అధికారుల అక్రమ వసూళ్లకు నిదర్శనం. కిందిస్థాయి అధికారుల అక్రమాలపై ఆర్టీవో మందలించినప్పటికీ.. ఫలితం లేకపోవడంతో ఆయనకు చెడ్డ పేరు రాకూడదనే ఉద్దేశంతో సిక్ లీవ్‌లో ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి.

మిగతా 8వ పేజీలో...

పైసలిస్తేనే ఫైలు ముందుకు..

- అక్బర్‌పేట-భూంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో వసూళ్ల పర్వం

మిరుదొడ్డి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వసూళ్ల పర్వం కొనసాగుతున్నది. దేశానికి అన్నంపెట్టే రైతులను ప్రభుత్వ అధికారులు అక్రమార్జన కోసం హరిగోస పెడుతున్నారు. కిందిస్థాయి సిబ్బంది నుంచి తహసీల్దార్ వరకు పైసలివ్వందే పనులు కావడంలేదనే విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఇటీవల రిజిస్ట్రేషన్ కోసం వెళ్లిన ఓ రైతుకు బ్యాంకులో అప్పు ఉందన్న సాకుతో ఫైలును తిరస్కరించారు. అయితే పని కావాలంటే డబ్బులు ఇవ్వాలని సదరు రైతుకు సిబ్బంది చెప్పడం గమనార్హం. ఒక్కో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ కోసం రూ.5వేల వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలకు అడ్డుకట్టవేయాలని మండల ప్రజలు కోరతున్నారు

యేటా ప్రభుత్వం ఉచిత చేప పిల్లలను పంపిణీ చేసి మత్స్యకారుల ఉపాధికి భరోసా కల్పించేది. 2016లో ఉచిత చేప విత్తనం పంపిణీ పథకం ప్రారంభం కాగా గతేడాది వరకు ఎనిమిదిసార్లు అందజేశారు. ప్రతీ ఏడాది మే, జూన్ వరకు టెండర్లను పూర్తి చేసి ఆగస్టులోగా చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో చేపలను వదిలే వారు. ఈ ఏడాది ఇప్పటివరకు చేపపిల్లలను పంపిణీ చేయకపోవడంతో గంగపుత్రులు గాబరా పడుతున్నారు. చేప విత్తన పంపిణీకి అదను దాటిపోవడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు కసరత్తు చేస్తున్నారు. అధికారుల నిర్ణయంపై మత్స్యకారులు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు.

- మెదక్, అక్టోబరు 20, (ఆంధ్రజ్యోతి)



మత్స్యకారుల్లో ఆశలు

ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు అధికారుల కసరత్తు
నేడు మత్స్యశాఖ ఏడీలతో అత్యవసర సమావేశం
ఇప్పటికే ఆలస్యమైన చేప పిల్లల పంపిణీ

టెండర్లలో నెలకొన్న జాప్యం కారణంగా ఈ ఏడు చేపపిల్లల విడుదలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. గతేడాది సరఫరా చేసిన చేపపిల్లల విత్తనాల పంపిణీకి సంబంధించి కాంట్రాక్టర్లకు బిల్లులు విడుదల కాకపోవడంతో ఈసారి ఆన్‌లైన్ టెండర్లు పాల్గొనేందుకు అంతగా ఆసక్తి కనబరచలేదు. ఎన్నిసార్లు నిర్వహించిన టెండర్లు ఖరారు కాలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలలో చేప పిల్లల పంపిణీ నిలిచిపోయింది. ఆగస్టు మాసంలో వదిలే చేప విత్తనం అక్టోబరు మూడో వారం వరకు సరఫరా చేయకపోవడంతో మత్స్యకారుల్లో ఆందోళన నెలకొంది. ప్రస్తుతం మరోమారు టెండర్లను పిలవడానికి ప్రభుత్వానికి సమయం చాలకపోవడంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఇందులో భాగంగానే సోమవారం హైదరాబాద్‌లోని ఫిషరీస్ కమిషనరేట్ కార్యాలయంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు డిప్యూటీ డైరెక్టర్ నుంచి జిల్లా మత్స్య సహకార అభివృద్ధి అధికారులకు పిలుపు వచ్చింది. దీంతో ఉమ్మడి జిల్లాలో చేప పిల్లల పంపిణీకి మార్గం సుగమం కావచ్చునని మత్స్యకారులు ఆశాభావం వ్యక్తం చేశారు.


చేపపిల్లలను వదులుతున్న మత్స్య కారులు(ఫైల్)

ఉమ్మడి జిల్లాలో సొసైటీలు, సభ్యులు

జిల్లా	సొసైటీ	సభ్యులు
మెదక్	284	15,721
సంగారెడ్డి	229	12,891
సిద్దిపేట	338	24,700

గతేడాదిలో సగమే.. అదీ ఆలస్యం

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 851 సొసైటీల్లో 53,312 మంది మత్స్యకారులు సభ్యులుగా ఉన్నారు. వీరికి ఉపాధి కల్పించేందుకు 6.47 కోట్ల చేప పిల్లలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న జలాశయాల్లో వదిలేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. అందులో మెదక్ జిల్లాలో 1,651 చెరువులు, కుంటలతో పాటు ఘనపూర్, హల్దీ, పోచారం ప్రాజక్టులలో ఈ సీజన్‌లో 2.62 కోట్ల చేప విత్తనం వదలాల్సి ఉంది. ఇది గత సంవత్సరం కంటే 50 శాతం తక్కువ. 2023-24 సీజన్‌లో 5.25 కోట్ల చేప పిల్లలను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఈసారి అందులో సగ భాగమే ఇవ్వాలని నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు. సిద్దిపేట జిల్లాలో 1,561 జలాశయాలతో పాటు, కొండపోచమ్మ, మల్లన్నసాగర్, రంగనాయకమ్మ సాగర్ ప్రాజక్టులలో పెంపకానికి 4.30 కోట్ల పిల్లలు అవసరం ఉండగా 2.15 కోట్లు, సంగారెడ్డి జిల్లాలో 1157 చెరువులు, కుంటలతో పాటు మూడు రిజర్వాయర్లలో 3.41 కోట్ల చేప విత్తనం వదలాల్సి ఉండగా, 1.70 కోట్ల చేప పిల్లల పంపిణీకి ప్రణాళిక రూపొందించారు. టెండర్లు ఖరారు కాకపోవడంతో ఈ అరకొర చేపపిల్లల పంపిణీ కూడా ఆలస్యమైంది.

హామీల అమలేదీ?

- ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు


మాజీ మంత్రి హరీశ్‌రావుకు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ నాయకులు

బెజ్జంకి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన 420 హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం కొత్తపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమానికి వెళ్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావుకు బెజ్జంకి క్రాసింగ్ వద్ద బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్ అమలులో విఫలమైందన్నారు. కొత్త పథకాలు ఇచ్చే మాట దేవుడెరుగు.. ఉన్న పథకాలనే రద్దు చేస్తున్నారన్నారు. కరోనా కష్టకాలంలో రూపాయి ఆదాయం లేకున్నా మాజీ సీఎం కేసీఆర్ సమయానికి రైతుల ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమ చేశారన్నారు. కానీ రేవంత్ సర్కారు రెండవ విడతకే రైతుబంధు నిధులు విడుదల చేయక రైతుల ఉసురు పోసుకుంటుందన్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేని దీనస్థితిలో కాంగ్రెస్ ఉందన్నారు. రుణమాఫీని సగంమందికి కూడా అమలు చేయలేదని కాంగ్రెస్ ప్రభుత్వానివి మాటలు ఎక్కువ చేతలు తక్కువ అని దుయ్యబట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతి పక్షాలను తిట్టడం, దాడులు చేయించడం, ఫొటోలకు ఫోజులు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ నిర్మల, మాజీ జడ్పీటీసీ కవిత, ఏఎంసీ మాజీ చైర్మన్ రాజయ్య, నాయకులు శ్రీనివాస్ గుప్తా, లక్ష్మణ్, భూపతి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

నిర్మాణంలో 50గదుల సత్రం భవనం


ఈసారీ.. వసతి లేనట్టే..

- నత్త నడకన సత్రం పనులు
- యేటా జాతర వరకు ప్రారంభమంటూ ఆరేళ్లుగా వాయిదా
- వచ్చే డిసెంబరులోనే మల్లన్న బ్రహ్మోత్సవాలు..

కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయానికి వచ్చే భక్తుల బస ఇక్కట్లు ఇప్పట్లో తీరేలా లేవు. 50 గదుల సత్రం నిర్మాణ పనులు నత్తనడకన సాగడమే అందుకు కారణం. పంచాయతీ రాజ్ అధికారుల పట్టింపులేని తనం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఆరేళ్లుగా పనులు కొనసాగుతూనే ఉన్నాయి.

చేర్యాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) :మల్లన్న ఆలయ సందర్శనార్థం నిత్యం వందలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఇక జాతరకు మూడునెలలపాటు భక్తుల తాకిడి విపరీతంగా ఉంటుంది. ఆలయ పరిధిలో కేవలం 140 వసతి గదులున్నాయి. వీటిలోనూ పలు గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో భక్తులకు ఇవ్వడంలేదు. మరి కొన్ని గదులు ఆలయ పరిపాలనకోసం వినియోగిస్తుండటంతో 80-90గదులు మాత్రమే భక్తుల బసకు ఇస్తున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు 2017 లో అప్పటి సీఎం కేసీఆర్ 50 గదుల భవన నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేయగా, 2018లో పనులు చేపట్టారు. రెండేళ్లలో పూర్తి చేయాల్సిన పనులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. పలుమార్లు కాంట్రాక్టు గడువును పొడిగిస్తూ వచ్చినా పనులు పూర్తిచేయడంలేదు. అంతేకాకుండా వాటర్ క్యూరింగ్ సరిగా చేయడంలేదని, సమపాళ్లలో సిమెంటు, ఇసుక వినియోగించడం లేదన్న ఆరోపణలున్నాయి. ఏటా బ్రహ్మోత్సవాల సమయంలో ఈసారి అందుబాటులోకి తీసుకువస్తామని పంచాయత్‌రాజ్ శాఖ అధికారులు చెబుతున్నా అమలుకు నోచుకోవడం లేదు. వచ్చే డిసెంబరులో జరిగే బ్రహ్మోత్సవాలకూ వసతి గదులు అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి త్వరితగతిన పనుల పూర్తి చేయాలని భక్తులు కోరుతున్నారు.

పనులను వేగవంతం చేస్తాం..

- శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ డీఈ

సత్రం భవనం నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. స్వామివారి జాతర ప్రారంభం నాటికి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. పనులు వేగవంతానికి చర్యలు తీసుకుంటాం.

హామీలు నెరవేర్చాల్సిందే : బీఆర్ఎస్

కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. సిద్దిపేట జిల్లాలో పలుచోట్ల రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రజలను విస్మరించిందని మండిపడ్డారు. ముఖ్యంగా రైతులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేసి గ్రామాల్లోకి రాకుండా కాంగ్రెస్ నాయకులను అడ్డుకుంటామని హెచ్చరించారు.


తొగుటలో రోడుపై బైఠాయించి ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

విద్యార్థులకు ఆరోగ్య ప్రశస్త్

- పిల్లల్లో మానసిక, శారీరక సమస్యల గుర్తింపునకు ప్రత్యేక యాప్
- వివరాలు పొందుపరిచి తగిన చికిత్స
- 63 ప్రశ్నలతో రెండు విడతల్లో పరీక్ష
- ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాలు

7లో

నిరుపయోగంగా వసతి గృహం

- శిథిలావస్థకు చేరిన భవనం
- ఒక గదిలో అంగన్‌వాడీ కేంద్రం
- పట్టించుకోని అధికారులు
- మరమ్మతులు చేస్తే ఉపయోగపడే అవకాశం

8లో

కాలువలో పడి వ్యక్తి మృతి

న్యాల్‌కల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చాల్కి గ్రామ సమీపంలో గల కత్వకాలువలో పడి కమ్మరిగోపాల్ మృతిచెందాడని జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హన్మంతు తెలిపారు. మృతుడు కొంతకాలంగా జహీరాబాద్, న్యాల్‌కల్ మండల పరిసర ప్రాంతాల్లో కూలీ పనులను చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గోపాల్‌కు మూర్ఛ ఉన్నదని.. ఈ క్రమంలో కాలువలో పడి మృతిచెంది ఉంటాడని చిన్నాన్న రాంచందర్ చెప్పారు. చిన్నాన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సులు మలిపేదెలా..!

● ఇన్-ఔట్‌కు అడ్డంగా వాహనాలు ● ఆర్టీసీ డ్రైవర్ల అవస్థలు



ఆర్టీసీ బస్టాండ్ మూల మలుపులో నిలిపిన వాహనాలు

రామాయంపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లి రావడం గగనమవుతోంది. ప్రతినిత్యం డ్రైవర్లు మూలమలుపులో రోడ్డు మీదకు వచ్చేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఇన్-ఔట్ ప్రదేశంలో తరచూ వాహనాలు అడ్డంగా నిలపటం ఇబ్బందులను తెచ్చిపెడుతోంది. ఇరుకుగా ఉన్న ఈ మలుపులో ఆర్టీసీ బస్సులు డివైడర్‌ను ఢీకొన్న ఘటనలు ఉన్నాయి. చిన్నపాటి రహదారి ఒక పక్క.. ఆ టర్నింగ్ వద్దే కార్లు, ద్విచక్ర వాహనాలు ఆపటం మరోపక్క ప్రమాదాలకు తావిస్తున్నాయి. బస్టాండ్ స్థలం ఆక్రమించి పూలు, పండ్ల దుకాణాలు తెరవడంతో ఈ సమస్య తలెత్తుతోంది. ఆర్టీసీ బస్టాండ్ రద్దీ ప్రదేశంలో ఉండటం.. ఇందుకు తగ్గట్టుగా రోడ్డు విస్తరణ జరగకపోవడం వల్ల ఆర్టీసీ బస్సుల రాకపోకలకు తిప్పలు తప్పడం లేదు. ఇకనైనా రహదారిని వెడల్పు చేసి ఆక్రమిత ఫుట్‌పాత్ వ్యాపారాలను క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కాంగ్రెస్ నేతల తీరును మంత్రి దృష్టికి తీసుకెళ్లాలి

● చిల్వర్‌లో కార్యకర్తల రహస్య సమావేశం



చిల్వర్‌లో సమావేశం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అల్లాదుర్గం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : అల్లాదుర్గం మండల కాంగ్రెస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరుపై మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లాలని తీర్మానిస్తూ.. ఆదివారం అల్లాదుర్గం మండలం చిల్వర్ గ్రామంలో కొందరు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు రహస్య సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పథకాల అమలుతీరుపై, ఇందిరమ్మ ఇళ్ల కమిటీల నియామకం తదితర అంశాలపై ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ గ్రామాల్లో గ్రూపులకు ఆజ్యం పోస్తున్నారని వారు చర్చించుకున్నట్లు సమాచారం. కొన్నాళ్లుగా జరుగుతున్న ఈ వ్యవహారంపై పలుమార్లు పార్టీ సమావేశంలో చర్చించినా ఎలాంటి మార్పురాలేదని కొందరు కార్యకర్తలు గుర్తుచేశారు. ఇందిరమ్మ కమిటీల్లోనూ ఒకే వర్గానికి చెందినవారి పేర్లనే ఎంపిక చేశారని, ఈ విషయాలపై మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని వారు తీర్మానించినట్లు తెలిసింది.



అక్కన్నపేట మండల కేంద్రంలో ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్ స్మారకార్థం నిర్మించిన బస్‌షెల్టర్



తూప్రాన్‌లో ఏర్పాటు చేసిన డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం

మీ త్యాగం మరువం

నక్సల్స్ దాడుల్లో అమరులెందరో..

- నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం
- అమరుల కుటుంబాలకు సన్మానం

మూడు దశాబ్దాల క్రితం ఉమ్మడి మెదక్ జిల్లాలో నక్సలైట్లు, పోలీసుల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్లలో ఎంతోమంది పోలీసులు అమరులయ్యారు. వారు చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ ఆయా ప్రాంతాల్లో చారిటబుల్ ట్రస్టులు, విగ్రహాలు, బస్‌షెల్టర్లు నిర్మించి అభిమానాన్ని చాటుకున్నారు. నేడు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా పోలీస్ అమరవీరుల కుటుంబాలను ఘనంగా సన్మానించనున్నారు.

హుస్నాబాద్/తూప్రాన్/రామాయంపేట/పాపన్నపేట/శివ్వంపేట/సిద్దిపేట క్రైం అక్టోబరు 20, ఆంధ్రజ్యోతి

ఎస్‌ఐ జాన్‌విల్సన్...

ప్రస్తుత అక్కన్నపేట మండలం రామవరం వద్ద 1991 డిసెంబరు 19న మొట్టమొదటి సారిగా మావోయిస్టులు (అప్పుడు పీపుల్స్‌వార్ నక్సలైట్లు) మందుపాతరతో బస్సును పేల్చి 15 మందిని హతమార్చిన సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. అందులో సీఐ యాదగిరి, ఎస్‌ఐ జాన్‌విల్సన్‌తో పాటు సీఆర్‌పీఎఫ్‌కు చెందిన సీఐ, కానిస్టేబుల్స్ ఉన్నారు. మరో తొమ్మిది మంది గాయపడ్డారు. ఆయన స్మారకార్థం హుస్నాబాద్ మండలం పందిల్లలో బస్‌షెల్టర్ నిర్మించారు. ప్రస్తుతం నేషనల్ హైవే నిర్మాణంలో దానిని తొలగించారు.

సీఐ యాదగిరి..

రామవరం మందుపాతరలో మృతిచెందిన అప్పటి హుస్నాబాద్ ఇన్‌చార్జి సీఐ యాదగిరి స్మారకార్థం హుస్నాబాద్ మండలం తోటపల్లి స్టేజీ వద్ద బస్‌షెల్టర్ నిర్మించారు. హుజూరాబాద్ సీఐగా ఉన్న యాదగిరి హుస్నాబాద్ ఇన్‌చార్జిగా వచ్చి మావోయిస్టులు పేల్చిన మందుపాతరలో అమరులయ్యారు. ఇక్కడి ప్రజలు ఆయన పేరున బస్‌షెల్టర్ నిర్మించి అభిమానాన్ని చాటుకున్నారు.

ప్రకాష్‌సింగ్...

కోహెడ మండలం సింగరాయ జాతరలో 1991 జనవరి 15న మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో ప్రకాష్‌సింగ్ అనే కానిస్టేబుల్ మృతిచెందారు. మరో కానిస్టేబుల్ గాయపడ్డారు. ప్రకాష్‌సింగ్ స్మారకార్థం కోహెడ క్రాసింగ్ వద్ద ప్రజలు విరాళాలతో బస్‌షెల్టర్ నిర్మించారు. ఇప్పటికీ ఆ బస్‌షెల్టర్ ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

ఎస్‌ఐ శ్రీనివాస్‌గౌడ్...

హుస్నాబాద్‌లో ప్రొబెషనరీ ఎస్‌ఐగా విధులు నిర్వర్తించిన మసిపట్ల శ్రీనివాస్‌గౌడ్ ఇక్కడి ప్రజల మన్ననలను పొందారు. కొనరావుపేట ఎస్‌ఐగా బదిలీ అయి 1998లో నక్సలైట్లు జరిపిన కాల్పుల్లో మృతిచెందారు. ఆయన పేరున అక్కన్నపేట మండలంలో బస్‌షెల్టర్ నిర్మించారు. ప్రజల్లో మంచిపేరు తెచ్చుకున్న పోలీసుల స్మారకార్థం ఇక్కడ అనేకం నిర్మించారు.

పిల్లుట్ల మందుపాతరకు డీఎస్పీ, సీఐ బలి

మెదక్ జిల్లా శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో 1997 నవంబరు 17న నక్సల్స్ పేల్చిన మందు పాతరకు తూప్రాన్ డీఎస్పీ అవ్వారు బాలసుబ్రహ్మణ్యం, తూప్రాన్ సీఐ వెంకటస్వామి, ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, లక్ష్మణ్‌నాయక్, సుజాయత్ అలీ బలయ్యారు. దీంతో తూప్రాన్ పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తాలో డీఎస్పీ అవ్వారు బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటు చేశారు. ఆయన చేసిన సేవలకు గుర్తుగా ప్రతియేటా కార్యక్రమాలు చేపట్టారు.

రామాయంపేట పోలీస్‌స్టేషన్ పేల్చివేతకు 30 ఏళ్లు

రామాయంపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): 1994 సంవత్సరం జనవరిలో పీపుల్స్ వార్ నక్సల్స్ రామాయంపేట పోలీస్ స్టేషన్‌ను పేల్చేశారు. ఆ సమయంలో విధుల్లో ఉన్న ఎస్‌ఐ సెట్టయ్య నక్సల్స్ దాడి పసిగట్టి పారిపోయి ప్రాణాలు కాపాడుకున్నాడు. ఇక డ్యూటీలో ఉన్న పోలీసులు సరెండర్ కావడంతో 13 తుపాకులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనలో పోలీసులు ఎవరూ గాయపడలేదు.

అమరవీరులకు సెల్యూట్

1999 సెప్టెంబరు 13న అర్ధరాత్రి పాపన్నపేట మండలంలోని పోలీస్‌స్టేషన్‌ను నక్సల్స్ పేల్చేయడంతో హెడ్ కానిస్టేబుల్ రఘునందన్, కానిస్టేబుల్స్ నర్సింహులు, అబేద్ హుస్సేన్, రామ్‌చందర్, ప్రసాద్ అమరులయ్యారు. వారికి గుర్తుగా పాపన్నపేట ఠాణాలో అమరవీరుల స్థూపం నిర్మించారు. నేడు పోలీసుల అమరవీరుల దినోత్సవం సందర్భంగా వారి కుటుంబసభ్యులకు మెదక్ ఎస్పీ కార్యాలయంలో సన్మానం ఉంటుందని ఎస్‌ఐ సత్తయ్యగౌడ్ పేర్కొన్నారు.



పాపన్నపేటలో నిర్మించిన అమరవీరుల స్థూపం

నేటి నుంచి అవగాహన కార్యక్రమాలు

పోలీస్ సంస్మరణ దినోత్సవం సందర్భంగా నేటి నుంచి 24వ తేదీవరకు ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పోలీసు విధులు, పోలీసులు వినియోగించే ఆయుధాలు, సాంకేతిక వినియోగం, షీటీం, భరోసా, సైబర్ సెక్యూరిటీ, ఆంటీ నార్కోటిక్ డ్రగ్, డాగ్‌స్క్వాడ్ విభాగాల విధులు, ప్రజల రక్షణ, పోలీసులు చేసిన సేవలు, త్యాగాల గురించి ప్రజలకు విద్యార్థులకు తెలియజేస్తారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులను ఎంపికచేసి రాష్ట్రస్థాయికి పంపిస్తారు. రక్తదాన కార్యక్రమాలు, పోలీస్ అమరవీరుల స్మరిస్తూ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తారు.

షార్ట్ ఫిలిమ్స్, ఫొటోగ్రఫీ పోటీలు

విద్యార్థులకు, యువతకు, ఔత్సాహిక ఫొటో, వీడియోగ్రాఫర్లకు పోలీసులు చేసిన సేవలకు సంబంధించిన ఫొటోలు లేదా రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో సేవ, పోలీసుల కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించే అంశాలపై మూడు నిమిషాలకు తగ్గించకుండా షార్ట్ వీడియోలను రూపొందించే కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ప్రతిభ కనబరిచిన మొదటి మూడు ఫొటోలను, వీడియోలను జిల్లా స్థాయిలో బహుమతి ప్రదానం చేస్తూ.. రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు. నేడు సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్‌లో పోలీస్ నిర్వహిస్తున్న పోలీసుల అమరవీరుల దినోత్సవానికి పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని సీపీ బీ.అనురాధ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ మను చౌదరి హాజరుకానునన్నారు. నేటి నుంచి 31 వరకు పోలీస్ అమరవీరుల గురించి తెలుపుతూ వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

క్రైం కార్నర్

తాళం వేసిన రెండు ఇళ్లలో చోరీ

- నగదు, వెండి, బంగారు ఆభరణాలు అపహరణ



శివ్వంపేట: చిన్నగొట్టిముక్కులలో బీరువాను ధ్వంసం చేసిన దుండగులు

శివ్వంపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న రెండు ఇళ్ల తాళాలను పగులగొట్టి నగదు వెండి, బంగారు ఆభరణాలను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. ఈ సంఘటన మెదక్ జిల్లా శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్కుల గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన కొడకంచి శంకర్‌గౌడ్ ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లాడు. శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు గడ్డపారతో ఇంటి తాళాలను పగులగొట్టి రూ.1.50 లక్షల నగదు, 20 తులాల వెండి, తులం మూడు గ్రాముల బంగారాన్ని అపహరించుకుపోయారు. అదేవిధంగా కోలమద్ది శ్రీపతిరావు ఇంటికి తాళం వేసి మూడురోజుల క్రితం హైదరాబాద్‌కు వెళ్లాడు. ఆదివారం ఉదయం వచ్చి చూడగా తాళం పగులగొట్టి బీరువాను ధ్వంసం చేసి పది తులాల వెండి, రూ.5 వేల నగదు అపహరించుకుపోయారని గ్రామస్థులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని క్లూస్‌టీం పరిశీలించగా.. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

బ్యాగులోంచి బంగారు ఆభరణాలు చోరీ

నారాయణఖేడ్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): బస్సు ఎక్కడానికి ప్రయత్నిస్తున్న ఓ మహిళా బ్యాగులోంచి గుర్తుతెలియని వ్యక్తులు 6.30 తులాల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. బాధితురాలి వివరాల ప్రకారం.. నాగల్‌గిద్ద మండలం ఏనక్‌పల్లికి చెందిన నిర్మల కొన్నేళ్లుగా కుటుంబీకులతో కలిసి హైదరాబాద్‌లో ఉంటుంది. సిర్గాపూర్ మండలం ఉజలంపాడ్‌లో బంధువుల ఇంట్లో విందుకు వచ్చి తిరిగి హైదరాబాద్‌కు వెళ్లేందుకు నారాయణఖేడ్ రాజీవ్ చౌక్‌లో శనివారం సాయంత్రం బస్సు ఎక్కి కూర్చున్నది. అయితే బస్సు ఎక్కుతున్న క్రమంలో ఎవరో బ్యాగును పట్టుకున్నట్లు అనిపించి, అనుమానంతో బ్యాగును పరిశీలించగా.. అందులో 6.30 తులాలకు సంబంధించిన నెక్లెస్, లాంగ్‌చైన్ తదితర బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఈ మేరకు బాధితురాలు ఖేడ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి



షాబుద్దీన్(ఫైల్)

బెజ్జంకి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని దేవక్కపల్లి రాజీవ్ రహదారి వద్ద జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా కేంద్రం నసీర్‌నగర్‌కు చెందిన షాబుద్దీన్(50) ఈ నెల 14న ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమయ్యాడని కుటుంబసభ్యులు సిద్దిపేట రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసుగా పోలీసులు నమోదు చేసుకున్నారు. కాగా దేవక్కపల్లి రాజీవ్ రహదారి సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెంది ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి వివరాలను సేకరించి మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

విద్యార్థులకు ఆరోగ్య ప్రశస్త్

పిల్లల్లో మానసిక, శారీరక సమస్యల గుర్తింపునకు ప్రత్యేక యాప్

- వివరాలు పొందుపరిచి చికిత్స
- 63 ప్రశ్నలతో రెండు విడతల్లో పరీక్ష
- ఉపాధ్యాయులకు అవగాహన కార్యక్రమాలు

కొండపాక, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వస్తున్న చాలామంది విద్యార్థులు శారీరక, మానసిక వైకల్యం, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతుంటారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు ఆరోగ్య విషయాలను పట్టించుకోవడంలో నిర్లక్ష్యానికి గురవుతున్నారు. అలాంటి వారి వివరాలను పాఠశాల స్థాయిలోనే గుర్తించేందుకు విద్యాశాఖ ప్రశస్త్ అనే ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఈ యాప్ ద్వారా గుర్తించిన వైకల్యాలను నేరుగా విద్యార్థులకు కాకుండా, విద్యార్థుల తల్లిదండ్రులకు మాత్రమే తెలియజేయనున్నారు.

రెండు విడతలుగా పరీక్షలు


సిద్దిపేట జిల్లాలో అన్నిరకాల ప్రభుత్వ పాఠశాలలు 1,034, ప్రైవేట్ పాఠశాలలు 226 ఉన్నాయి. మొత్తంగా సుమారు లక్షా యాభై వేలకు పైగా విద్యార్థులు ఉంటారు. వీరందరి వివరాలు ప్రశస్త్ యాప్‌లో నమోదు చేయనున్నారు. ఈ యాప్ ద్వారా విద్యార్థులకు రెండు విడతలుగా పరీక్షలు నిర్వహించి గుర్తించనున్నారు. మొదటి విభాగంలో 63 ప్రశ్నలను పొందుపర్చి సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను ప్రశ్నించి, సమాధానాలను ప్రత్యేక ప్రశస్త్ యాప్‌లో పొందుపరుస్తారు. రెండో విభాగంలో యాప్‌లో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ పూర్తిచేస్తారు. విద్యార్థుల్లో ఉన్న అన్నిరకాల శారీరక, మానసిక, సామాజిక, విద్యా సామర్థ్యాలకు, బుద్ధి మాంద్యం, చలనాలకు సంబంధించి వైకల్యాలను పరిశీలించి యాప్‌లో సర్వే ఫారం ద్వారా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ సమాధానాల ఆధారంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, వైకల్యాలను వారి తల్లిదండ్రులకు తెలియజేస్తారు.

అవగాహనా కార్యక్రమాలు

ఇప్పటికే జిల్లాస్థాయిలో ప్రశస్త్ యాప్‌పై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు రిసోర్స్‌పర్సన్లు అవగాహన కల్పించారు. ప్రభుత్వ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులతో పాటు ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు కూడా ప్రశస్త్ యాప్‌పై అవగాహన చేశారు. దీంతో విద్యార్థుల వైకల్యాలను గుర్తించి, వారికి చికిత్స అందించనున్నారు.

ఎందుకు.. ఉపయోగం ఏమిటి?

అన్ని వైకల్య పరిస్థితులు కనిపించే విధంగా ఉండవు. చాలా వైకల్యాలను పరిశీలన ద్వారా గుర్తించవలసి ఉంటుంది. నూతన విద్యా విధానం 2020కి అనుకూలంగా అన్ని పాఠశాలల్లోని విద్యార్థుల్లో గల వైకల్యాలను ప్రశస్త్ ఆప్ ద్వారా గుర్తించడానికి ఎన్‌సీఈఆర్‌టీ వారు తయారు చేసిన ఒక సాధనం.



63 ప్రశ్నల ద్వారా పరిశీలన

ప్రశస్త్ యాప్ ద్వారా వైకల్యాలను గుర్తించనున్నాం. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులందరినీ 63 ప్రశ్నల ద్వారా పరిశీలించనున్నాం. యాప్‌పై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చాం. విద్యార్థుల్లో ఉన్న వైకల్యాలను గుర్తించి చికిత్స అందించాలన్నది దీని ప్రధాన ఉద్దేశం.

- శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి

'ప్రశస్త్' అనగా..

- ప్రాథమిక అంచనాలు పాఠశాలల కోసం స్క్రీనింగ్ టూల్.
- ఈ సర్వేలో విద్యార్థి అవయవాల ఉపయోగం.
- పనులు ఎలా చేస్తున్నాడు.
- మాటలు ఎలా మాట్లాడుతున్నాడు.
- కాళ్లు, చేతులు ఎలా ఉన్నాయి.
- తల ఎలా ఉన్నది, పొడవు పొట్టి, చేతివేళ్లు మొదలైన శారీరక అవయవాలకు సంబంధించిన సర్వే ప్రశ్నలు ఉంటాయి.
- విద్యార్థి ఎలా చదువుతున్నాడు?
- చూపు ఏ విధంగా ఉంది?
- రంగులను గుర్తిస్తున్నాడా?
- నల్లబల్ల కనిపిస్తుందా? ఎలా రాస్తున్నాడు?
- చదివేటప్పుడు సరిగా చదువుతున్నాడా?
- హోంవర్క్ సరిగా చేస్తున్నాడా?
- అతని ప్రవర్తనలు తరగతి గదిలో ఇతర విద్యార్థులతో ఎలా ఉన్నాయి.
- ఉపాధ్యాయుని సూచనలు పాటిస్తున్నాడా... గణిత చిహ్నాలను గుర్తిస్తున్నాడా? వంటి సర్వే ప్రశ్నలు ఉంటాయి.

గజ్వేల్ ప్రభుత్వాస్పత్రిలో శిశువు మృతి

- నార్మల్ డెలివరీకి ప్రయత్నించిన వైద్యులు
- పరిస్థితి విషమంగా ఉండడంతో సెక్షన్ డెలివరీకి తరలింపు
- విగత జీవిగా జన్మించిన మగ శిశువు



మృతిచెందిన శిశువును పట్టుకుని రోధిస్తున్న మనీలా కుటుంబసభ్యులు

గజ్వేల్/గజ్వేల్‌రూరల్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో అప్పుడే పుట్టిన శిశువు మృతిచెందాడు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం యావాపూర్ గ్రామానికి చెందిన రామనిగళ్ల మనీలా(26) శనివారం ఉదయం ప్రసూతి కోసం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. మొదటి కాన్పు సాధారణంగా జరగడంతో రెండో కాన్పు సైతం సాధారణంగా చేసేందుకు గజ్వేల్ వైద్యులు ప్రయత్నించారు. ఈ క్రమంలోనే మనీలా ఆరోగ్యం విషమంగా మారడంతో వెంటనే సెక్షన్‌కు తరలించారు. ఉదయం 7 గంటలకు మగబిడ్డ విగత జీవిగా జన్మించినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న మనీలా బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. సెక్షన్ డెలివరీ చేసి ఉంటే తమ శిశువు బతికేదని, వైద్యుల నిర్లక్ష్యంతోనే బాబు చనిపోయాడని కుటుంబసభ్యులు ఆరోపించారు. ఈ విషయమై ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ సాయికిరణ్‌ను వివరణ కోరగా.. శిశువు మృతిచెందిన విషయం వాస్తవమేనని, ఈ విషయంలో విచారణ జరుపుతామని తెలిపారు.

విద్యాపీఠంలో వైభవంగా గజపాద ఘట్టం



సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమంలో ఏనుగుకు పూజలు చేస్తున్న మహేశ్వరశర్మ సిద్ధాంతి

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమంలో ఆదివారం ఆశ్రమ వ్యవస్థాపకుడు మహేశ్వరశర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో గజపాదఘట్టణోత్సవం వైభవంగా జరిగింది. ఇందులోభాగంగా కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా కడకంచి గ్రామం నుంచి వచ్చిన గజరాజుపై అమ్మవారిని ఉంచి విశేషోత్సవం ద్వారా బుద్ధి బలం, సౌభాగ్యం, సంపద, ధైర్యం కలుగుతాయని సిద్ధాంతి ప్రబోధించారు. ఈ మహోత్సవంలో పాల్గొనే విద్యార్థుల్లో బుద్ధి వికాసం, మహిళలకు అఖండ సౌభాగ్యం, పురుషులకు విశేష సంపద, ప్రతి వ్యక్తికి ధైర్యం, సంపదలు కలుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ సభ్యులు ప్రశాంత్‌కుమార్, సాయి, శ్రీనివాస్, రాజ్‌కుమార్, తోపాజి అనంతకిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా వాలీబాల్ విజేత మెదక్



ట్రోఫీని అందుకుంటున్న మెదక్ జట్టు

మెదక్ అర్బన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా వాలీబాల్ విజేతగా మెదక్ జట్టు నిలిచింది. అండర్-17 బాల బాలికలకు ఆదివారం గీత హైస్కూల్‌లో వాలీబాల్ పోటీలు జరిగాయి. బాలుర విభాగంలో మెదక్ జిల్లా జట్టు ప్రతిభ కనబరిచి సిద్దిపేట, సంగారెడ్డి జట్లను ఓడించి ప్రథమ బహుమతిని గెలుచుకుంది. ద్వితీయస్థానంలో సిద్దిపేట, తృతీయస్థానంలో సంగారెడ్డి జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో సంగారెడ్డి జట్టు సిద్దిపేట, మెదక్ జట్లను ఓడించి ప్రథమస్థానంలో నిలిచింది. ద్వితీయస్థానంలో సిద్దిపేట, తృతీయస్థానంలో మెదక్ నిలిచాయి. ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్టు ఈనెల 28న పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొంటాయని అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

ప్రమాదవశాత్తు రేకుల ఇల్లు దగ్ధం



కాలిపోయిన నోట్లు

పాపన్నపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రేగుల ఇల్లు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని యూసుఫ్‌పేట గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. బాధితుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కోదండం సాయిలు బుడగజంగం కాలనీలో రేకుల ఇంట్లో నివాసముంటున్నాడు. ఓ పని నిమిత్తం ఇంట్లోంచి బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు అంటుకున్నాయి. బయటకు పొగ వ్యాపించడంతో స్థానికులు ఆర్పే ప్రయత్నం చేశారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లో బీరువాలో ఉన్న డబ్బులు, బంగారం, వెండి వస్తువులు, నిత్యావసర సరుకులు, వస్తువులు మంటల్లో కాలిపోయాయి. సుమారు రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు.

పార్టీలకతీతంగా హక్కుల సాధనకు కృషి చేద్దాం

- కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు రూరల్/వర్గల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన కోసం, సామాజిక న్యాయం కోసం పార్టీలకతీతంగా ముదిరాజ్‌లందరూ ఏకతాటిపైకి రావడం ఐకమత్యానికి నిదర్శనమని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ నియోజకవర్గం చక్రిపురం క్రాస్ రోడ్ సిరి గార్డెన్స్‌లో కుషాయిగూడ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అలాయి బలాయి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలోనే ముదిరాజ్ కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. తొందరలోనే బీసీ కులగణన పూర్తవుతుందన్నారు. కులగణన తర్వాత ముదిరాజులను బీసీ డీ నుంచి బీసీఏలోకి మార్చే ప్రక్రియ కోసం కృషిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చొప్పరి శంకర్ ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర యువత అధ్యక్షుడు పండగ బాలు, పిట్టల నాగరాజ్, గడ్డల పాండు, జెడల శంకర్, పుర యాదగిరి, శ్రీకాంత్, హరిబాబు పాల్గొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం తునికిఖాల్సాలో జరిగిన పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠకు డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితో కలిసి హాజరై మాట్లాడారు. అనంతరం పెద్దమ్మతల్లి ఆలయ నిర్వాహకులు వారిని సన్మానించి, అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు శ్రీరాం నర్సింహులు, గ్రామ అధ్యక్షుడు జెల్ల మల్లేశం, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో హరీశ్‌రావు

వర్గల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వర్గల్ మండలం తునికిఖాల్సాలో ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్మాణన పెద్దమ్మతల్లి ఆలయంలో జరిగిన విగ్రహ ప్రతిష్ఠాపనకు మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, బీఆర్‌ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి హాజరయ్యారు. వారిని ఆలయ నిర్వాహకులు సన్మానించారు. వారి వెంట బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెంకటరెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు నాగరాజు ఉన్నారు.



ముదిరాజ్ నేతలతో నీలం మధు సంఘీభావం

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బెజ్జంకి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని బెజ్జంకి క్రాసింగ్‌లో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెజ్జంకి క్రాసింగ్‌కు చెందిన బింగి స్వామి (42) అనే వ్యక్తి ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. శనివారం మండలంలోని గాగిల్లాపూర్‌కు పని నిమిత్తం వెళ్లి తిరిగి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈక్రమంలో గాగిల్లాపూర్ స్టేజీ వద్ద ఉన్న ఓ పెట్రోల్ బంక్‌లోకి పెట్రోల్ పోయించుకునేందుకు రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో స్వామి తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఓ ప్రైవేయిట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ స్వామి ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి కుమారుడు వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

నిరుపయోగంగా వసతి గృహం

- శిథిలావస్థకు చేరిన వైనం
- ఒక గదిలో అంగన్‌వాడీ కేంద్రం
- మరమ్మతులు చేస్తే ఉపయోగపడే అవకాశం


శిథిలావస్థకు చేరిన ఎస్సీ బాలికల వసతి గృహం, నిరుపయోగంగా ఉన్న గదులు

కోహెడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కోహెడ మండలం శనిగరంలో లక్షలు వెచ్చించి నిర్మించిన హాస్టల్ భవనం ఏళ్లుగా నిరుపయోగంగా ఉంది. పక్కా భవనాన్ని సద్వినియోగం చేసుకోకపోవడం, అధికారులు పట్టించుకోక శిథిలావస్థకు చేరుతున్నది. గ్రామంలో 30 ఏళ్ల క్రితం షెడ్యూల్ కులాల (ఎస్సీ) బాలికల వసతి గృహం నిర్మించారు. ఇందులో 14 గదుల వరకు ఉన్నాయి. మంచినీటి బోరు కూడా ఉంది. వార్డెన్ ఉండేందుకు భవనం కూడా నిర్మించారు. 2014 వరకు 100 మందికి పైగా బాలికలు ఈ హాస్టల్ భవనంలో ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకునే వారు. అప్పటి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఉన్న కోహెడ మండలం శనిగరం, బెజ్జంకి మండలం బేగంపేట, తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామంలో ఎస్సీ బాలికల హాస్టల్స్ ఉండేవి. అప్పటి ప్రభుత్వం షెడ్యూల్ కులాల బాలికల కోసం ఇంటిగ్రేటెడ్ హాస్టల్స్‌ను ప్రారంభించింది. నుస్తులాపూర్ గ్రామంలో 5 ఎకరాల్లో 300 మంది విద్యార్థినులు చదువుకునేలా హాస్టల్ భవనం నిర్మించింది. దీంతో శనిగరం, బేగంపేట హాస్టల్స్‌లో చదువుకునే విద్యార్థినులను నుస్తులాపూర్ బాలికల వసతి గృహంలో కలిపేశారు. విద్యార్థులు ఖాళీ చేసి వెళ్లిపోవడంతో అప్పటినుంచి పక్కా భవనం ఖాళీగా ఉంటుంది. కేవలం ఒక గదిలో మాత్రమే అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుతుంది. మరమ్మతు చేస్తే మరో పదేళ్ల ఇతరత్రా వాటికి వాడుకోవచ్చు. లేదా ప్రాజెక్టు ఉండడంతో ఏదైనా కార్యాలయాలు, గ్రంథాలయం, ఆ గ్రామంలో ఉన్న పశు వైద్యశాలకు వాడుకోవచ్చునని గ్రామస్థులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ప్రతీ సంవత్సరం ధాన్యం కొనుగోలుకు వచ్చే సంచులు ఇతరత్రా వాటికి వాడుకుంటున్నారు. ఖాళీగా ఉన్న భవనానికి మరమ్మతు చేసి వాడు కోవాలని సూచించినా ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. లక్షలు వెచ్చించి నిర్మించిన భవనాన్ని 10 ఏళ్లుగా ఎవరూ పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తుంది. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి సిద్దిపేట జిల్లాలో ఉన్న ఈ సంక్షేమ హాస్టల్ భవనంలో మళ్లీ బాలికల హాస్టల్ ప్రారంభించాలని, విద్యార్థునుల కోసం వినియోగంలోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరుతున్నది..

భవనం శిథిలావస్థకు చేరుతున్నది. చిన్న చిన్న మరమత్తులు చేపట్టి గ్రంథాలయానికి, లేదా మళ్లీ బాలికల హాస్టల్ ప్రారంభమయ్యేలా మంత్రి చూడాలి. లేకుంటే ఇతర కార్యాలయాలకు ఉపయోగించుకుంటే బాగుంటుంది. మరో 15 ఏళ్లు వాడుకోవచ్చు.

- గాజె శ్రీనివాస్, శనిగరం

సాహిత్యం ఉత్తమ సమాజాన్ని సృష్టిస్తుంది

- పెద్దపల్లి అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్ లాల్

హుస్నాబాద్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సాహిత్యం ఉత్తమ సమాజాన్ని సృష్టిస్తుందని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ పేర్కొన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో స్ఫూర్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కవి, రచయిత అన్నవరం దేవేందర్ రాసిన అంతరంగం పుస్తకావిష్కరణ, జర్నలిస్టు ఫజుల్ రహమాన్‌కు పుస్తక అంకితోత్సవం, జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా నియామకమైన కేడం లింగమూర్తి అభినందోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. కవులు, రచయితలు ప్రజలకు ఉపయోగపడే రచనలు చేయాలన్నారు. పుస్తకాలు చదవడం, రాయడం గొప్ప ఆలోచన విధానానికి పునాది వేస్తుందన్నారు. న్యాయవాది, అరసం అధ్యక్షుడు గులాబిల మల్లారెడ్డి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అంతరంగాల పుస్తకాన్ని జర్నలిస్టు ఎండీ ఫజుల్‌రహమాన్‌కు అంకితం ఇచ్చారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా నియామకమైన కేడం లింగమూర్తిని సన్మానించారు. కార్యక్రమంలో పుస్తక రచయిత అన్నవరం దేవేందర్, స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఫిలిం సొసైటీ దక్షిణ భారత సమాఖ్య అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ పొన్నం రవిచంద్ర, మాజీ ఏజీపీ చిత్తారి రవీందర్ తదితరులున్నారు.

సమాజానికి సాహిత్యం జీవనాడి

- జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి

హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి): సమాజానికి సాహిత్యం జీవనాడి లాంటిదని జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని కౌన్సిలర్ చిత్తారి పద్మ గృహంలో ఆదివారం నిర్వహించిన కవి, గాయక సమ్మేళనంలో మాట్లాడారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ప్రొఫెసర్ సాయిబాబాకు నివాళులర్పించారు. గ్రంథాలయా చైర్మన్‌గా నియామకమైన లింగమూర్తిని కవులు, కళాకారులు సన్మానించారు. కార్యక్రమంలో జనజాగృతి కళా సమితి చైర్మన్ ముక్కెర సంపత్‌కుమార్, కౌన్సిలర్ చిత్తారి పద్మ, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లింగాల సాయన్న, జేఏసీ కోఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్, స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్ తదితరులున్నారు.

ప్రజలను మోసం చేసి అధికారంలోకి..

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతు భరోసాపై ఆదివారం చేసిన ప్రకటనను నిరసిస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీలు, రాస్తారోకోలు చేపట్టారు. ప్రజలను కాంగ్రెస్ మోసం చేసి అధికారంలోకి వచ్చిందని ఈ సందర్భంగా నాయకులు దుయ్యబట్టారు. పలుచోట్ల ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు.

- న్యూస్ నెట్‌వర్క్


సిద్దిపేట రూరల్: సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


కొండపాక: వెలికట్ట క్రాస్‌రోడ్ వద్ద రాజీవ్ రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


దుబ్బాక: అక్బర్‌పేట- భూంపల్లి మండల కేంద్రంలో రోడ్డుపై బైఠాయించిన ఆందోళన చేస్తున్న నాయకులు

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగించుకోవాలి

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. చేర్యాల మండలంలోని మర్రిముస్త్యాల, ముస్త్యాల గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం మార్కెట్ కమిటీ చైర్మన్ ఎన్. శ్వేతతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ధాన్యం ఉత్పత్తిలో రాష్ట్ర దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచిందన్నారు. అలాగే కొమురవెల్లిలో రైతు భరోసా బీమా వెంటనే అమలు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

- మద్దూరు: మద్దూరు మండలకేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ నాగుపల్లి శ్వేత, వైస్ చైర్మన్ కామిడి జీవన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఉమ్మడి మండల అధ్యక్షుడు మేక మల్లేశం, కోలసాయిలు, బీఆర్‌ఎస్ మండలపార్టీ అధ్యక్షుడు మేక సంతోష్, మంద యాదగిరి, ఏపీఎం బాబురావు, సీసీ ప్రేమలతతో పాటు సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలి

- కాంగ్రెస్ నాయకులు


ఎస్ఐ బాలకృష్ణకు ఫిర్యాదును అందజేస్తున్న నాయకులు

చిన్నకోడూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసి ఆయన దిష్టిబొమ్మను దహనం చేసిన బీఆర్‌ఎస్ నాయకులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆదివారం కాంగ్రెస్ నాయకులు చిన్నకోడూరు ఎస్ఐ బాలకృష్ణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తూ, రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మీసం మహేందర్, పరుశురాం, జయంత్, చాంద్‌పాషా, నాగరాజు, ప్రశాంత్, రాజు, స్వామి, రాజుకుమార్, రాజు

బీఆర్‌ఎస్ అసమర్థతను కాంగ్రెస్‌పై రుద్దడం సరికాదు

- గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి

గజ్వేల్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ అసమర్థతను కాంగ్రెస్‌పై రుద్దడం సరికాదని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి విమర్శించారు. గజ్వేల్ పట్టణంలోని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి నివాసంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. పదేళ్లలో బస్టాండ్‌ను పూర్తి చేయాలని, రింగ్ రోడ్డును పూర్తి చేయలేని అసమర్థ బీఆర్‌ఎస్ కాంగ్రెస్‌పై నిందలు మోపడం సరికాదన్నారు. ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కనీస వసతులు కల్పించకుండా మాతా శిశు ఆసుపత్రి, తూప్రాన్ రోడ్డులో బస్టాండ్‌ను ఆగమేఘాల మీద ఎవరు ప్రారంభించారో చెప్పాలన్నారు. సిద్దిపేట యువకులను తీసుకువచ్చి పదేళ్లు గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ జిల్లా హాస్పిటల్‌లో పనిచేయించి క్రమబద్ధీకరించుకుని తీసుకెళ్లారని ఆరోపించారు. సురక్ష ఏజెన్సీ ద్వారా ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. వారివెంట కాంగ్రెస్ నాయకులు కరుణాకర్‌రెడ్డి, సుఖేందర్, అక్కారం యాదగిరి, నరసింహారెడ్డి, సయ్యద్ మతిన్, వహీద్, కుంట్ల లక్ష్మారెడ్డి, సుభాష్ చంద్రబోస్, గాడిపల్లి శ్రీనివాస్, జహీర్, షరీఫ్, ఊడెం శ్రీనివాస్‌రెడ్డి, నక్క రాములు, అజ్గర్, దయ్యాల యాదగిరి, సొక్కం సురేష్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి

'సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకుంటున్న ప్రభుత్వం'

- బీఆర్‌ఎస్ నాయకులు

చిన్నకోడూరు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సిద్దిపేట ప్రజల పట్ల వివక్ష చూపుతూ ఈ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుంటుందని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కామిని శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ కీసరి పాపయ్య ఆరోపించారు. చిన్నకోడూరు మండల కేంద్రంలో అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సిద్దిపేట ఎల్లమ్మ గుడి నుంచి చిన్నకోడూరు మండలం కిష్టాపూర్ వరకు నాలుగు లైన్‌ల రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన మొదటి దశ రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని, రెండో దశ రోడ్డు నిర్మాణ పనులకు నిధులను తిరిగి మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఉమేష్ చంద్ర, బీఆర్‌ఎస్ నాయకులు జంగిటి శ్రీనివాస్, రాజయ్య, ఆనంద్, రమేష్ పాల్గొన్నారు.



చేర్యాల మండల కేంద్రం శివారు వేచరేణి క్రాస్‌రోడ్డు కొమురవెల్లి స్వాగతతోరణం ఎదురుగా ఓ విద్యుత్‌స్తంభంపై భాగం శిథిలమై ప్రమాదకరంగా మారింది. సీసీ ధ్వంసమై ఇనుపచువ్వలు బయటపడి ప్రమాదకరంగా ఉన్నది. అయినా విద్యుత్ సిబ్బంది పట్టించుకోకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు విన్నవించినా విద్యుత్ సిబ్బంది స్పందించడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నూతన స్తంభం వేయాలని వారు కోరుతున్నారు.

- చేర్యాల

రంగధాంపల్లి రాజీవ్ రహదారిపై ఫ్లై ఓవర్ నిర్మించాలి

- డీఈఈకి గ్రామస్థుల వినతి


వినతిపత్రం అందజేస్తున్న రంగధాంపల్లి గ్రామస్థులు

సిద్దిపేట అర్బన్,అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి నిర్మాణంతో ఇళ్లు, వ్యవసాయ భూములు కోల్పోతున్నామని, రంగధాంపల్లి రాజీవ్ రహదారిపై ఫ్లై ఓవర్ నిర్మించాలని రంగధాంపల్లి గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. రంగధాంపల్లి రాజీవ్ రహదారి నిర్మాణ పనులను అడ్డుకుని ఆదివారం డీఈఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. రాజీవ్ రహదారి నిర్మాణంతో ఇళ్లు, భూములు కోల్పోతున్నామని, ఫ్లై ఓవర్ నిర్మించే వరకు నిర్మాణాలను కూల్చవద్దని కోరారు. జీవనాధారమైన వ్యవసాయ భూములు కోల్పోవడం వల్ల తమకు ఉపాధి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తి చేశారు. తమ పొట్ట కొట్టొద్దని అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు వంగ నాగిరెడ్డి, తిరుమలరెడ్డి, ముత్యాల కనకయ్య, శ్రీనివాస్‌గౌడ్, వెంకటస్వామి, రజనీకాంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, దుర్గారెడ్డి, రాజు, రంగం, ఆంజనేయులు, కనకారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి కార్పొరేషన్‌కు రూ. 5 వేల కోట్లు కేటాయించాలి: రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు

హుస్నాబాద్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రెడ్డి కార్పొరేషన్‌కు రూ. 5 వేల కోట్లు కేటాయించి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రెడ్డి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అప్పన్న రాంరెడ్డి కోరారు. హుస్నాబాద్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెడ్డిలలో అనేక మంది కడు పేదరికంతో జీవిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు మారినా రెడ్డిల సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. రెడ్డిల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోనట్లయితే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కాయిత లక్ష్మారెడ్డి, ఎలకంటి మహేందర్‌రెడ్డి, గూడ భాస్కర్‌రెడ్డి తదితరులున్నారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

- ఆదివారం కావడంతో పెరిగిన రద్దీ

చేర్యాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లన్న ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా పలు ప్రాంతాలను వచ్చిన భక్తులు కోనేరులో స్నామాచరించి తలనీలాలు సమర్పించారు. మల్లన్నకు ముఖమండపం పట్నం రచించారు. అనంతరం స్వామివారి దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మల్లన్న సహోదరి ఎల్లమ్మ తల్లికి కల్లు, బెల్లం సాక సమర్పించి పసుపు కుంకుమలను కాపాడాలని వేడుకున్నారు.


జగదేవ్‌పూర్: కొండపోచమ్మ దర్శనం కోసం క్యూలో బారులు తీరిన భక్తులు

- జగదేవ్‌పూర్: మండలంలోని కొండపోచమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు మధ్యాహ్నం కొండపోచమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సిద్దిపేట మున్సిపల్ చైర్మన్ మంజుల రాజనర్సు, నాయకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నామని ఆలయ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది కనకయ్య, లక్ష్మణ్, సుధాకర్, హరి, చిన్న తదితరులు పాల్గొన్నారు.


చేర్యాల: గంగిరేగు చెట్టుకు ముడుపులు కడుతున్న భక్తులు

- గజ్వేల్ రూరల్: గజ్వేల్ మండల పరిధిలోని కొడకండ్ల గ్రామంలో ఎల్లమ్మ ఆలయంలో డీకొండ గణేష్ ఆధ్వర్యంలో నాగదేవత విగ్రహాన్ని ప్రతిష్ఠంతి పూజలు నిర్వహించారు.

మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసిన కాంగ్రెస్ నాయకులు


మంత్రి జూపల్లికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శివప్ప

సిద్దిపేట టౌన్, అక్టోబరు20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అర్హులకు అందేలా చూడాలని మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించినట్లు కాంగ్రెస్ సిద్దిపేట నాయకుడు శివప్ప తెలిపారు. మెదక్ జిల్లా రావాయంపేటలోని షబ్బీర్‌అలీ ఫాంహౌజ్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు, షబ్బీర్‌అలీ, సురేష్‌షెట్కార్‌లను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా శివప్ప మాట్లాడుతూ.. సిద్దిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతం కోసం కృషిచేస్తానని తెలిపారు.

నీలకంఠ సమాజం అధ్యక్షుడిగా లోక లక్ష్మీరాజం


లోక లక్ష్మీరాజంను సన్మానిస్తున్న రాజనర్సు

సిద్దిపేట టౌన్, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట నీలకంఠ సమాజం నూతన అధ్యక్షుడిగా లోక లక్ష్మీరాజం, కార్యదర్శిగా గవ్వల శంకర్, కోశాధికారిగా కడవేరుగు శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని నీలకంఠ ఆలయంలో ఆదివారం అఖిలభారత నీలకంఠ సమాజం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం సందర్భంగా రాజనర్సు హాజరై నూతన కార్యవర్గ సభ్యులను అభినందించి సత్కరించారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా లోక లక్ష్మీరాజంతో పాటు పాలకవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా లోక లక్ష్మీరాజం మాట్లాడుతూ.. నూతన అధ్యక్షుడిగా తనను ఎన్నుకున్నందుకు నీలకంఠ సమాజం సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సమాజం నాయకులు కౌన్సిలర్ యోగేశ్వర్, కడవేరుగు నర్సింహులు, సురేష్, కడవేరుగు రాజు, వీరబత్తిని జనార్దన్, మల్లేశం, కృష్ణ పలువురు సభ్యులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం

- జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం

ములుగు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ సలీం పేర్కొన్నారు. ములుగులో గ్రామ కమిటీ అధ్యక్షుడు కొండు నర్సింహులు ఆధ్వర్యంలో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల కమిటీని వేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజమైన నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకుంటామన్నారు. సమావేశంలో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కడపల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

60:40 వసూలు చేయ్.. పంచేయ్..!

5వ పేజీ తరువాయి..



జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఒక ఇన్‌చార్జి ఆర్టీవో, ఒక ఎంవీఐ, ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లు, ఐదుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, ముగ్గురు కానిస్టేబుళ్లు, ముగ్గురు హోంగార్డులు ఉన్నారు. ఇక్కడ ఎంవీఐ చెప్పిందే వేదంగా కిందిస్థాయి అధికారులు నడుచుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయన హుస్నాబాద్ ఆర్టీవో కార్యాలయంలో పనిచేసే మంచి అనుభవమున్న ఓ సీనియర్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని డిప్యుటేషన్‌పై ఇక్కడకు రప్పించుకుని మరీ వసూళ్లకు పాల్పడుతున్నాడనే ఆరోపణలున్నాయి. కార్యాలయ పరిసర ప్రాంతంలో ఏజెంట్లు/బ్రోకర్లను అందుబాటులో ఉంచి పని నిమిత్తం వచ్చినవారిని నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిసింది. ప్రధానంగా ఒక అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి, ఒక కానిస్టేబుల్, ఒక హోంగార్డ్ సహకారంతో ఎంవీఐ అధికారి ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిసింది. వసూళ్ల విషయమై గతంలో ప్రైవేట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగిపై జేటీసీ(జాయింట్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్)కి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఐదింటికి.. ఒక్కదానిపైనే కేసు..

కార్యాలయానికి వచ్చినవారినుంచే కాదు.. రహదారులపై వాహన తనిఖీల్లోనూ రవాణాశాఖ అధికారులు తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఫిట్‌నెస్ లేని, ట్యాక్స్ కట్టని, ఇన్సూరెన్స్ లేని తదితర వాహనాలపై కేసులు నమోదు చేయడంతోపాటు జరిమానా విధించాల్సింది పోయి డబ్బులు తీసుకుని వదిలేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఉదాహరణకు ఒకరోజు ఐదు లారీలు పట్టుకుంటే వాటిలో ఒక లారీపై మాత్రమే కేసు నమోదు చేసి, మిగతా లారీల ఓనర్లతో సెటిల్మెంట్ చేసుకుంటున్నారు. ఎంవీఐ అధికారి ఆదేశాల మేరకు కానిస్టేబుల్, హోంగార్డు రోడ్లపై వాహనాలను అదుపులోకి తీసుకుని యథేచ్ఛగా వసూళ్లకు పాల్పడుతున్నారు. అంతేకాకుండా ఎలాంటి ఎవిడెన్స్ లేకుండా వాహన యజమానితో డ్రైవర్‌కి ఫోన్ పే, గూగుల్ పే చేయించి.. అతడి నుంచి ఏటీఎంలో డ్రా చేయించుకుని నగదు తీసుకుంటున్నారు.

ప్రజలకు నో ఎంట్రీ..

సిద్దిపేట రవాణా శాఖ కార్యాలయానికి వివిధ సమాచారం కోసం, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ మైగ్రేషన్ కోసం వచ్చేవారికి లోపలికి అనుమతి ఇవ్వడం లేదు. ప్రతి రవాణాశాఖ కార్యాలయ ఆవరణలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి, అక్కడ ఒక కానిస్టేబుల్‌ను ఉంచి ప్రజలకు కావలసిన సమాచారాన్ని అందించాలి. కానీ ఈ కార్యాలయంలో మాత్రం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసిన రెండు రోజులకే తీసివేశారు. దీంతో సమాచారం ఇచ్చే వారు లేక, కార్యాలయంలోకి అనుమతివ్వక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

కార్డులు పొందాలన్నా డబ్బులే..

కార్యాలయంలో డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కార్డులు పొందాలన్నా డబ్బులు ముట్టజెప్పక తప్పడంలేదని పలువురు వాపోతున్నారు. సాధారణంగా కార్డులను పోస్టు ద్వారా ఇంటికి పంపించాలి. కానీ డబ్బులు రాబట్టాలనే ఉద్దేశంతో డమ్మీ ఈఎంఎస్ నంబర్ వేసి కార్డులను పోస్ట్ చేస్తున్నారు. దీంతో అవి లబ్ధిదారులకు చేరకపోవడంతో వారు నేరుగా ఆఫీసుకు వస్తున్నారు. ఎలాంటి అనుమానం రాకుండా ఏవో సాకులు చెప్పి రెండుమూడు రోజులు కార్యాలయం చుట్టూ తిప్పించుకుని చివరికి రూ.200 నుంచి రూ.300 వసూలు చేసి కార్డులను అందజేస్తున్నారు. కాగా, వివిధ రకాలుగా వసూలు చేసిన డబ్బుల్లో 60 శాతం ఎంవీఐ తీసుకొని.. మిగతా 40 శాతం ఆఫీస్ సిబ్బందికి పంచుతున్నట్లు సమాచారం.